క్లుప్తంగా

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలి


మాట్లాడుతున్న జడ్జి పి.జె.సుధ

ఆదోనిరూరల్: మార్చి 9వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదోని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి(జడ్జి), మండల న్యాసేవాధికార సంస్థ చైర్మన్ పి.జె.సుధ పోలీసులకు సూచించారు. శనివారం స్థానిక కోర్టులో డీఎస్పీ శివనారాయణ స్వామి, పోలీసులతో జడ్జి సమావేశమయ్యారు. జడ్జి మాట్లాడుతూ లోక్‌అదాలత్ గురించి కక్షిదారులకు, ప్రజలకు తెలియజేయాలన్నారు. రాజీయే రాజమార్గమని అవగాహన కల్పించి, కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

కోసిగి: స్థానిక బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువజాము నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు, ఫల,పుష్పాలు సమర్పించి మహా మంగళ హారతులు పట్టి పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శివస్వాములు ప్రత్యేక భక్త భజనలు చేశారు. భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప

ఆదోనిరూరల్: స్థానిక రెవెన్యూభవన్‌లో శనివారం ఈవీఎం యంత్రాల పనితీరుపై బీఎల్ఓలకు, సెక్టోరల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప మాట్లాడుతూ నియోజకవర్గంలోని 256 పోలింగ్ కేంద్రాలకు గానూ విడతల వారీగా 158 నుంచి 207వ పోలింగ్ కేంద్రం వరకు బీఎల్‌వోలకు, సెక్టోరల్ ఆఫీసర్లకు ఈవీయం యంత్రాల పనితీరుపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఎన్నికల్లో ఓటర్లు తడబాటుకు గురికాకుండా డెమో ప్రదర్శనలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవి కుమార్, లేబర్ ఆఫీసర్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ గోపీనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనీయం



బోరు వేయిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తనీవమని వైస్ ఎంపీపీ కే.ముత్తమ్మ తెలిపారు. జలజీవన్ మిషన్ కింద రూ.4.5 లక్షలతో మండల పరిధిలోని చిన్నతుంబళంలో శనివారం 3 బోర్లను వేయించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తరాదని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బోర్లు వేయించామని చెప్పారు. కార్యక్రమంలో గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప, నాయకులు లింగన్నగౌడ్, సోమప్పధని, రాముడు, బ్రహ్మయ్య, వీరేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా జేజేఎం పనులు


ట్యాంకు పనులు చేస్తున్న కూలీలు

కౌతాళం: మండలంలోని గుడికంబాలి గ్రామంలో రూ.65 లక్షలతో జలజీవన్ మిషన్ పథకం కింద పనులు చేపట్టారు. ఇంటింటికీ మంచినీరు అందించడానికి ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణపు పనులు, అలాగే పైప్‌లైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చేయడంతో పాటు ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మిస్తున్నట్లు సర్పంచ్ సిద్దేశ్ తెలిపారు.


గ్రామంలో పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

వందగల్లులో అభివృద్ధి పరుగులు

- ప్రగతి పథంలో మారుమూల గ్రామం
- గడప గడపకు అందిన సంక్షేమ ఫలాలు
- ప్రత్యక్ష, పరోక్షంగా రూ.28,20,56,654 మేర లబ్ధి
- ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుతో పల్లెకు కొత్తందం
- వసతులు సమకూరడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

వైఎస్సార్‌సీపీ పాలనలో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి బాటలో పరుగులు తీస్తున్నాయి. కోసిగి మండలంలోని వందగల్లు గ్రామంలో కనీస వసతులు లేక ఇన్నేళ్లుగా స్థానికులు ఇబ్బందులు పడ్డారు. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో నాలుగున్నరేళ్లలో సౌకర్యాలు సమకూరగా.. గ్రామంలోనే పథకాలు, పాలన అందించేందుకు సచివాలయ భవనాలు, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం తదితర భవనాలను నిర్మించారు. కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలు అందడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు.


రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం


రూ.17.50లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

కోసిగి : మండల కేంద్రానికి 7 కిలోమీటర్లు దూరంలోనున్న వందగల్లు గ్రామం నాలుగేళ్ల క్రితం వరకు కనీస వసతులు లేక, సంక్షేమ పథకాలు అందక, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయింది. గ్రామంలో ప్రధానంగా తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తుండేది. నిత్యం పనులు మానుకుని గ్రామస్తులు కిలో మీటర్ల దూరంలో నుండే వ్యవసాయ బోర్లను ఆశ్రయించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చొరవతో రూ.20లక్షలు కేటాయించి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో తోడేళ్ల చెరువు వద్ద ప్రత్యేకంగా బోరు వేయించి పైప్‌లైన్ ఏర్పాటు చేయించి, గ్రామంలో 9 మినీ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి కుళాయిలు అమర్చారు. దీంతో గ్రామస్తులకు నీటి సమస్య తీరింది. రెండేళ్లుగా పుష్కలంగా నీరందుతోంది.

- గ్రామంలోనే సేవలు అందించేందుకు రూ.40 లక్షలతో సచివాలయం నిర్మాణం పూర్తి చేశారు.
- రూ.17.50 లక్షలతో గ్రామంలో వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారు.
- ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో కాల్వ బుడ్డయ్య ఇంటి నుంచి కుమ్మరి కుంట వరకు డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు చేయించారు.
- గడప గడప మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో మజ్జిగ గిరిణి ఇంటి నుంచి చిలకమ్మ ఇంటి వరకు, చావిడి నుంచి ఈరన్న ఇంటివరకు రోడ్డు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.



- రూ.10లక్షలతో ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ, రన్నింగ్ అండ్ డ్రికింగ్ వాటర్, ఫర్నీచర్స్ ఏర్పాటు చేశారు.

పాఠశాలకు స్థలం విరాళం..

గ్రామంలోనున్న ప్రాథమికోన్నత పాఠశాల..ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. 10వ తరగతి వరకు ప్రస్తుతం ఇరుక్కు గదుల్లోనే చదువుకుంటున్నారు. ఉన్నత పాఠశాలకు ప్రభుత్వం నాడు–నేడు రెండవ విడత కింద 11 గదుల నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం రూ.2.30 కోట్లు నిధులు కేటాయించింది. అయితే గ్రామంలో ప్రభుత్వ స్థలం లేక పోవడంతో నిధులు వెనుకమళ్లే పరిస్థితి నెలకొంది. గ్రామ పిల్లల బంగారు భవిష్యత్‌కు అందించేందుకు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ కాల్వ కొరవంజమ్మ భర్త కాల్వ లక్ష్మయ్య తన కున్న పొలంలో 51 సెంట్లు పాఠశాల నిర్మాణానికి (రూ.50 లక్షలకు పైగానే విలువజేసే స్థలం) విరాళంగా ఇచ్చారు. ఆ పొలాన్ని పాఠశాల పేరిట రాసివ్వడంతో అదే స్థలంలో ప్రస్తుతం గదుల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి.


గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ

సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు.. (ప్రత్యక్ష నగదు బదిలీ)

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి
అమ్మ ఒడి	630	రూ.3,02,91,396
వసతి దీవెన	136	రూ.23,55,819
విద్యాదీవెన	103	రూ.16,16,087
రైతు భరోసా	694	రూ.3,50,01,000
ఉచిత పంటల బీమా	705	రూ.1,52,10,338
రైతులకుసున్నావడ్డీరుణాలు	151	రూ.4,48,504
పెన్షన్ కానుక	414	రూ.3,84,21,000
వైఎస్సార్ చేయూత	233	రూ.1,05,37,500
వైఎస్సార్ ఆసరా	365	రూ.57,73,623
వైఎస్సార్‌సున్నావడ్డీ(ఎస్‌హెచ్‌జీ)	621	రూ.12,45,776
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	134	రూ.31,89,988
ఆరోగ్యఆసరా	80	రూ.3,58,550
హౌసింగ్	156	రూ.1,86,91,529
వైఎస్సార్ బీమా	13	రూ.21,60,000
వాహనమిత్ర	16	రూ.4,00,000
జగనన్న చేదోడు	18	రూ.3,90,000
కోవిడ్ సహాయం	1031	రూ.10,31,000
జగనన్నతోడు(వడ్డీ)	41	రూ.17,387
పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ)		
20.ఇంటి స్థలాలు భూసేకరణ ఖర్చు	278	రూ.6,83,88,000
21. విద్యాకానుక	855	రూ. 60,72,210
22. 8వతరగతికి ట్యాబ్‌లు	73	రూ.9,65,206
23. జగనన్న తోడు(రుణాలు)	43	రూ.8,00,617
24. జగనన్న గోరుముద్ద	828	రూ.82,02,996
25. వైఎస్సార్ సంపూర్ణ పోషణ	360	రూ. 67,42,800
26. ఇంటింటి రేషన్ (79.80లక్షల టన్నులు)	1087	రూ.2,37,44,428
మొత్తం		రూ.28,20,56,654


నాడు-నేడు కింద నిర్మిస్తున్న ఉన్నత పాఠశాల గదులు

పిల్లల చదువు కోసం స్థలం విరాళం ఇచ్చాం



మా గ్రామ పిల్లలు బాగా చదువు కోవాలని నాకున్న పొలంలో 51 సెంట్లు పాఠశాలకు విరాళంగా ఇచ్చాను. గతంలో ఆడ పిల్లలను 5వ తరగతి వరకు చదివించి మానిపించేవాళ్లు. గ్రామంలోనున్న పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేశారు. ఇప్పుడు గ్రామంలోనుండే బాలికలు 10వ తరగతి వరకు చదువుకుంటుండటం సంతోషంగా ఉంది.

– కాల్వ లక్ష్మయ్య, గ్రామ పెద్ద

ఇలాంటి పాలన చూడలేదు



చాళ్ల ఏళ్లుగా గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్తులం చాలా ఇబ్బందులు పడ్డాం. జగన్ సార్ వచ్చినాక.. ఊరికి దూరంగా బోరు వేయించి పైప్‌లైన్ ద్వారా గుమ్మీలు పెట్టించారు. కుళాయిలకు నీళ్లందుతుండటంతో మాకు నీటి కష్టాలు తప్పాయి. మాకు రైతు భరోసా, పంట నష్టపరిహారం , వైఎస్సార్ చేయూత సొమ్ము అందింది. అలాగే ఇంటి స్థం కేటాయించారు. 50 ఏళ్లుగా ఇలాంటి పరిపాలన చూడలేదు. ఇలా పేదలకు సాయం చేస్తే జీవితాంతం గుండెల్లో పెట్టుకుంటారు.

– నాడుగేని ఊశేని, వందగల్లు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పీఠాధిపతి సిద్దరూఢ మహాస్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న మురళీమోహన్ రెడ్డి


కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కోసిగి: స్థానిక రైల్వే గేటు సమీపంలో కొలువైన శ్రీ సిద్ధరూఢ స్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. శనివారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని వేకువజాము నుంచి స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, పుణ్యహవాచనం, బిల్వార్చన, మహామంగళ హారుతుల గావించి విశేష పూజలు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం షణ్ముఖరూఢ మఠం పీఠాధిపతి అభినవ సిద్ధరూఢ మహాస్వామి, ఉరుకుంద గవి మఠం పీఠాధిపతి కరిబసరాజేంద్ర స్వామి, గూళ్యపాళెం ప్రణవానందగిరి స్వామి, స్వరూపనందగిరి స్వామి, శివానంద స్వామి, గురుసేవానంద స్వామి తిప్పయ్య స్వామి హాజరై మూడు రోజుల పాటు భక్తులకు సిద్ధరూఢ స్వామి జీవిత చరిత్రను వివరించారు. అనంతరం పీఠాధిపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యం సన్మానించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీమోహన్ రెడ్డి హాజరై పీఠాధిపతులను సన్మానించి ఆశీర్వాదం పొందారు. సాయంత్రం సిద్దరూఢ స్వామి ఉత్సవమూర్తిని చిన్నపాటి రథంపై కొలువుంచి మేళతాళాలు, కలశాలతో ఆలయం చెంత నుంచి రైల్వే గేటు వరకు ఊరేగించారు. దీంతో మూడు రోజులుగా ఆలయం ప్రాంగణంలో పూజలు, ఉపన్యాసం కార్యక్రమాలు ముగిశాయి.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు


జ్యోతులను ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలకేంద్రంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి 27వ జ్యోతి మహోత్సవాలను తొగటవీర క్షత్రియులు వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున స్థానిక మల్లికార్జున స్వామి ఆలయంలో తొగటవీరక్షత్రియులు ప్రత్యేక పూజలు నిర్వహించి రెండు అమ్మవారి జ్యోతులను తయారు చేసి భజన పాటలు, ఖడ్గాలతో జ్యోతులను వెలగించారు. అనంతరం పుర వీధుల్లో నృత్యాలు చేస్తూ, మంగళ వాయిద్యాలతో చిన్నారులు, ఆడపడుచుల కళశాలతో ముందు నడవగా అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, నాయకులు బ్రహ్మయ్య పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు తొగటవీర క్షత్రియులకు ఇచ్చిన హామీలో భాగంగా కల్యాణమండపం నిర్మాణానికి ఎంపీ నిధులు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం కల్యాణమండపం పనులు లెంటల్ దశకు చేరాయని చెప్పారు. త్వరలో నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

కోసిగి: స్థానిక ఎన్టీఆర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో సాగుతున్న రోడ్డు పనులను వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి శనివారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీర్టీ అధికారంలోకి వచ్చాక మండల కేంద్రంలో వాడ వాడలా సీసీ రోడ్లు వేయించామని, డ్రైనేజీలు నిర్మించినట్లు చెప్పారు. రూ.3కోట్లకు పైగా వెచ్చించి పట్టణంలో పనులు చేశామన్నారు. ఎంపీపీ ఈరన్న, బుళ్లి నరసింహులు, నాడుగేని వీరేష్, నాడుగేని వీరారెడ్డి, అయ్యమ్మ, గ్యాంగ్ ఈరన్న,ప్రతాప్, గోపాల్ పాల్గొన్నారు.

27న హుండీ కానుకల లెక్కింపు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలోని హుండీల కానుకల లెక్కింపును మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ రెండు నెలల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొనే వారు పంచ, ఉత్తరీయం ధరించి రావాలని కోరారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కౌతాళం: మండలంలోని ఎరిగేరి గ్రామంలో నూతనంగా ఏర్పడిన ఆర్‌డీటీ కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ గోవిందు, గ్రామ ఇన్‌చార్జ్ నీలకంఠరెడ్డి శనివారం తెలిపారు. కాలనీలో 30 వీధి స్తంభాలను ఏర్పాటు చేశామని అలాగే గ్రామంలో పది శిథిలమైన స్తంభాలను కూడా మార్చినట్లు చెప్పారు. దీంతో గ్రామంలో విద్యుత్ స్తంభాల సమస్య తీరిందన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులకు బస్సు సౌకర్యం

ఆదోనిరూరల్: మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు ప్రాంతాల్లో ఆదివారం గ్రూప్–2 పరీక్ష రాసే అభ్యర్థులకు ఆదోని డిపో నుంచి బస్సు సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ మహ్మద్‌రఫీక్ శనివారం తెలిపారు. సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రూప్–2 అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వవరాలకు 9959225797, 9959166566 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

హిందువుల మనోభావాలను గౌరవించాలి

ఆదోనిఅర్బన్: హిందువుల మనోభావాలను గౌరవించాలని, అక్రమ వసూళ్లను అరికట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. శనివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మహాశివరాత్రి సమీపిస్తున్న సమయంలో భక్తులు పాదయాత్ర ద్వారా శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో ఆత్మకూరు నుంచి వయా వెంకటాపురం అటవీ మార్గంలో వెళ్తారన్నారు. అయితే ఒక్కో భక్తుడి నుంచి అటవీశాఖ సిబ్బంది రూ.10 రుసుమును అక్రమంగా వసూలు చేస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా అటవీశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు.

అర్హులందరికీ ఇళ్లు


వెంకన్నపేట మహిళలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం, పక్కా ఇల్లు మంజూరు చేస్తామని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం 26వ వార్డు వెంకన్నపేట వీధికి చెందిన పేద మహిళలు 40 మందికి ఇంటి పట్టాలను ఎమ్మెల్యే స్వగృహంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు మంజూరు చేసి, వారి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఏదేని సమస్య ఉన్నా నేరుగా తనదృష్టికి తీసుకురావాలని కోరారు. మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం మహిళల పేరిటనే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ మల్లికార్జున, పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాళిబొట్లు, వెండి మెట్టెల అందజేత

ఆదోనిరూరల్: గోనబావి గ్రామానికి చెందిన ఉరుకుందమ్మ, జయన్నస్వామి కుమారుడు ధనుంజయస్వామి వివాహానికి, పట్టణంలోని ఇంద్రనగర్‌కు చెందిన మాలమ్మ, జేసీ నారాయణ దంపతుల కుమారుడు జేసీ జ్యోతాష్ వివాహానికి శనివారం ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి బంగారు తాళిబొట్లు, వెండిమెట్టెలను అందించారు. వివాహం చేసుకునే జంటలకు తనవంతుగా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే చెప్పారు.

వాటర్ పంపింగ్ పరిశీలన

ఆదోనిటౌన్: పట్టణానికి తాగునీటిని అందించే బసాపురం ఎస్ఎస్ ట్యాంకులోకి వాటర్ పంపింగ్‌ను శనివారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఎంఈ చలపతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్ సింహం నాగేంద్ర పరిశీలించారు. తుంగభద్ర దిగువ కాలువలో సరఫరా అవుతున్న నీటిని చెరువులోకి వేగవంతంగా పంపింగ్ చేయాలని వాటర్ వర్క్స్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. నీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. తుంగభద్ర దిగువ కాలువలో తాగునీటి నిమిత్తమే బోర్డు అధికారులు నీటిని విడుదల చేశారని తెలిపారు. కెనాల్‌లో నీటి సరఫరా నిలిచిపోయేలోగా సామర్థ్యం మేరకు నీటిని పంపింగ్ చేసి చెరువును పూర్తిస్థాయిలో నింపుకునేలా చూడాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడతామని, మరమ్మతులు ఉంటే ఆయా కాలనీల్లో వేగంగా చేపట్టాలని ఆదేశించారు.

హాల్‌టికెట్లు ఇవ్వని కళాశాలలపై చర్యలు తీసుకోండి

ఆదోనిరూరల్: ఫీజులు చెల్లించకపోతే హాల్ టికెట్లు ఇవ్వనన్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆదోనిలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటర్మీడియెట్ కళాశాలల యాజమాన్యం పరీక్షలు రాస్తున్న ప్రతిఒక్క విద్యార్థికి హాల్‌టికెట్లు ఇవ్వాలని, ఫీజులు కట్టలేదని విద్యార్థులను ఒత్తిడికి గురి చేయడం పరీక్షల సమయంలో సరైన పద్ధతి కాదన్నారు. ఒక పక్క పరీక్షల భయంతో, మరో పక్క ఫీజులు కట్టకపోతే హాల్ టికెట్లు ఇవ్వరన్న ఆందోళనలో విద్యార్థులు నలిగిపోతున్నారన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు మనోజ్‌కుమార్, వీరేష్, గిడ్డయ్య, నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

వాయుపుత్రుడికి విశేష పూజలు

కౌతాళం: మండలలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుదులదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. తెల్లవారుజామున అర్చకులు స్వామి వారికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు. అలాగే స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఆదోనిరూరల్: ఎన్నికల విధి నిర్వహణలో ప్రతిఒక్క అధికారి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదోని ఎన్నికల అధికార, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్టీ, వీవీటీ, వీఎస్టీ టీమ్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల విధులు నాణ్యతతో నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప, ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయశేఖర్, మున్సిపల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి తోంటధార్య ఆరాధనోత్సవాలు

కౌతాళం: మండలంలోని నదిచాగి గ్రామంలో వెలసిన తోంటధార్యమ ఆరాధనోత్సవాలు ఆదివారం నుంచి మార్చి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మఠం పీఠాధిపతి శ్రీ సిద్ధలింగ మహాస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తోంటధార్య స్వాముల వారి 78వ ఆరాధోనోత్సవాలను చెన్నబసవ శివయోగి వారి ఆశీస్సులతో చేపట్టినట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు సాయంత్రం 7గంటలకు శ్రీ ఎమ్మిగనూరు జడే సిద్దేశ్వర స్వామి జీవన దర్శన పురాణ ప్రవచనంలో మఠంలో కొనసాగుతుందన్నారు. మార్చి 5న మహారథోత్సం ఉంటుందని పేర్కొని వివరించారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

ఆదోనిరూరల్: ఆశావర్కర్స్ జిల్లా శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, మండల అధ్యక్ష కార్యదర్శులు రామాంజనేయులు, వీరారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదివారం ఏపీ ఆశావర్కర్స్ జిల్లా శిక్షణ తరగతులు ఆదోనిలోని మార్కెట్‌యార్డు వద్దగల సుందరయ్య భవనంలో జరుగుతాయన్నారు. ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు తిక్కప్ప తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఆదోనిసెంట్రల్: ఈనెల 26న అనంతపురంలోని జూనియర్ కళాశాల మైదానంలో చేపట్టే రాష్ట్ర పునఃనిర్మాణ పోరాట సభను విజయవంతం చేయాలని ఆదోని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలకంఠప్ప పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అధ్యక్షతన జరిగే ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకగాంధీ హాజరవుతున్నారన్నారు.